# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఈశాన్య రాష్ట్రాలను సుస్థిర అభివృద్ధికి కేంద్రాలుగా మారుస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల మధ్య సహకారం, పరస్పర విశ్వాసం ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు.
- సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తిలో ప్రపంచానికి భారత్ విశ్వసనీయమైన భాగస్వామిగా ఉందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.
- దేశంలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలను జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య రాష్ట్రాలను సుస్థిర అభివృద్ధికి కేంద్రాలుగా మారుస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సిక్కిం రాష్ట్రం ఆవిర్భావించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 4 వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు ఈశాన్య ప్రాంతవ్యాప్తంగా 6 క్రికెట్ అకాడమీలకు నరేంద్ర మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ... మౌలిక సదుపాయాల కల్పన ద్వారా సిక్కింకు దేశంలోని ఇతర ప్రాంతాలతో మరింత సులభమైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. సిక్కిం ఆర్థిక వృద్ధికి పర్యాటక రంగమే కీలకమని ప్రధానమంత్రి గుర్తు చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

లోక్‌సభ, శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లను అమలు చేయడమే కేంద్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. వారణాసిలో సుమారు 6 వేల 350 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించి శంకుస్థాపన చేశారు. ఇందులో రైలు, రోడ్డు, నీరు, ఆరోగ్య సంరక్షణ, పర్యాటకం, పట్టణ మౌలిక సదుపాయాలతో సహా కీలక రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఉన్నాయి. అనంతరం మహిళా సమ్మేళనంలో పాల్గొన్న ప్రధాని మాట్లాడుతూ... దేశ విధాన రూపకల్పనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి కృషి జరుగుతోందని చెప్పారు. ఇదిలా ఉండగా రెండు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నరేంద్ర మోదీ ప్రారంభించారు. అదే విధంగా గంగా నదిపై రైలు-రోడ్డు వంతెన నిర్మాణంతో సహా వారణాసి-పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్ మూడవ, నాలుగవ రైల్వే లైన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయంలో రేపు ప్రధానమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం హర్దోయ్ లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = =

షాంఘై సహకార సంస్థ (SCO) సభ్య దేశాల మధ్య మరింత సహకారం, పరస్పర విశ్వాసం ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. సమానత్వం, పరస్పర గౌరవం, లోతైన అవగాహన ఆధారంగా సభ్య దేశాలు ముందుకు సాగాలని కోరారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో ఈరోజు జరిగిన SCO రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శాంతియుత భవిష్యత్ కోసం SCO పని చేయాల్సి ఉందన్నారు. ప్రపంచ దృక్పథం మారుతున్న దశలో దేశాల మధ్య సామరస్యం తగ్గుతున్న క్రమంలో SCO తీసుకునే నిర్ణయాలు మరింత ప్రాధాన్యతను కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. SCO సభ్య దేశాల మధ్య చర్చలు, ఉమ్మడి భద్రతా సవాళ్లపై అవగాహనను పెంచుతాయని, రక్షణ భద్రతా రంగంలో భవిష్యత్ సహకారానికి కొత్త మార్గాలను అన్వేషిస్తాయని రాజ్ నాథ్ సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు. SCOకు నిర్మాణాత్మక సహకారం అందించడానికి భారతదేశం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి అన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలను ఈరోజు జారీ చేసింది. కార్మికులు, కూలీల కోసం భద్రతా చర్యలను తక్షణమే అమలు చేయడానికి పరిశ్రమలు, నిర్మాణ సంస్థలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించింది. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో పనిచేసే వారిని రక్షించడానికి సమన్వయంతో కూడిన బహుముఖ విధానం అవసరమని కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో సూచించింది. కార్మికుల కోసం తగినంత తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, విశ్రాంతి ప్రదేశాలు పని ప్రదేశాలను చల్లగా ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలని కోరింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తిలో ప్రపంచానికి భారత్ విశ్వసనీయమైన భాగస్వామిగా మారిందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలసి విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కి కేంద్రమంత్రి భూమి పూజ ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... దేశీయంగా అవసరమైన 50 శాతం ఎలక్ట్రానిక్ పరికరాలను భారత్ లోనే ఉత్పత్తి చేసుకుంటున్నామని తెలిపారు. సెమీ కండక్టర్ మిషన్ లో భాగంగా ఇప్పటికే వాణిజ్యపరమైన ఉత్పత్తిని కూడా భారత్ లో ప్రారంభించామని చెప్పారు. డేటా సెంటర్లకు అవసరమైన సర్వర్లను దేశంలోనే ఉత్పత్తి చేసుకోవాలని టెక్నాలజీ సంస్థలకు కేంద్రమంత్రి పిలుపునిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా గృహ వినియోగానికి ఎల్‌పిజి, పిఎన్‌జిలను వంద శాతం సరఫరా చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. అదే విధంగా రవాణాకు సంబంధించి సీఎన్‌జీ సరఫరా సాఫీగా జరిగేలా చూస్తామని వెల్లడించింది. న్యూఢిల్లీలో జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ... ఎల్పీజీ సరఫరాలో ఆసుపత్రులు, విద్యా సంస్థలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. దేశంలోని గృహ వినియోగ ఎల్‌పిజి సరఫరా స్థిరంగా ఉందని తెలిపారు. వాణిజ్య ఎల్‌పిజి, పిఎన్‌జి సరఫరాలను 70 శాతం వరకు ప్రభుత్వం పునరుద్ధరిస్తోందని, ఇందులో వలస కార్మికుల కోసం ఐదు కిలోల ఫ్రీ-ట్రేడ్ ఎల్‌పిజి సిలిండర్ల సరఫరాను రెట్టింపు చేశామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడానికి అభివృద్ధి చెందిన దేశాలతో భారతదేశానికి ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఎగుమతిదారులను, పారిశ్రామిక సంస్థలను కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కోరారు. ఎగుమతి ప్రోత్సాహక మండలాలు పారిశ్రామిక సంఘాలతో న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సమావేశానికి కేంద్రమంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2025-26లో భారతదేశ మొత్తం వస్తు సేవల ఎగుమతులు 860 బిలియన్ డాలర్లకుపైగా సాధించాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక విధాలుగా ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, రసాయనాలు, రత్నాలు, ఆభరణాలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల వంటి రంగాలు తమ ఎగుమతులను పెంచుకున్నాయని ఆయన పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలలో భాగంగా 2030 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ఎగుమతులను సాధించడానికి కృషి చేస్తున్నట్లుగా పీయూష్ గోయల్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మేఘాలయ ప్రభుత్వం జారీ చేసిన అధికార భాషల ఆర్డినెన్స్-2026కు గవర్నర్ చంద్రశేఖర్ హెచ్. విజయశంకర్ ఆమోదం తెలిపారు. దీని ప్రకారం ఇంగ్లీషుతో పాటు ఖాసీ, గారో భాషలు రాష్ట్ర అధికార భాషలుగా మారాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా పంజాబ్‌లోని ముల్లన్‌పూర్ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన రాజస్థాన్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన పంజాబ్ కింగ్స్ 12 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =